# భద్రాచలంలో ఎగిరేది గులాబీ జెండానే..

- వెంకట్రావును భారీ మెజార్టీతో గెలిపించాలి
- 19న మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రోడ్డు షో
- ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

వాజేడు, నవంబర్ 15 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయం ఖాయమని భద్రాచలం గడ్డ మీద ఎగిరేది గులాబీ జెండానే అని ఖమ్మం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు వెంకట్రావును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. వెంకట్రావు గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. దళితబంధు ఇప్పిస్తామని ఎమ్మెల్యే వీరయ్య, ఆయన అనుచరులు వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. వారికి దళిత సామాజికవర్గం ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ నెల 19వ తేదీన భద్రాచలంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, మరో మంత్రి హరీశ్‌రావు రోడ్డు షో ఉంటుందని, కార్యకర్తలు, అభిమనులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

### సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు

భద్రాచలం, నవంబర్ 15 : బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్సీ, భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తాతా మధుసూదన్ అన్నారు. బుధవారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన పలువురికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ నుంచి వచ్చిన కావూరి గోపి, కావూరి ప్రభాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదన్నారు. తెల్లం వెంకట్రావును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు.



కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు

## ఘనంగా రామయ్య నిత్య కల్యాణం



రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలం, నవంబర్ 15 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో బుధవారం సీతారాముల నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున అర్చకులు ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం నిర్వహించారు. నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి కల్యాణం జరిపించారు. భక్తులకు స్వామి వారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు.

## ఉచిత ఆయుర్వేద శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు ఉషారాణి

దుమ్ముగూడెం, నవంబర్ 15 : మండల పరిధిలోని పాత నారాయణరావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. కీళ్లవాతం, సంధివాతం, గ్యాస్‌ట్రబుల్, అజీర్ణం, చర్మవ్యాధులు, స్త్రీ సంబంధిత వ్యాధులు, రక్తహీనత, పుండ్లు, మెడనొప్పులు, కిడ్నీరాళ్లు, మలబద్ధకం, జలుబు, దగ్గు, దమ్ము, ఆయాసం, జ్వరం తదితర వ్యాధులకు వైద్యురాలు ఉషారాణి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎన్‌సీఎస్ ఈశ్వరి, ఏఎన్ఎం సరోజిని, ఆశ కార్యకర్త నాగమణి, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

## కార్తీక వన భోజనాలకు తరలిరావాలి

భద్రాచలం, నవంబర్ 15 : కూనవరం వద్ద గల కోతులగుట్ట సమీపంలోని బగాన్‌పురం వద్ద ఈ నెల 19వ తేదీన జరిగే కార్తీక వన భోజనాలకు దేవాంగ కులస్తులు తరలిరావాలని ఆ సంఘం అధ్యక్షుడు ఏకుల రామచంద్రరావు పిలుపునిచ్చారు. భద్రాచలం చుట్టుపక్కల గల వాజేడు, వెంకటాపురం, చర్ల, భదారచలం, వేలేరుపాడు, కూనవరం, వీఆర్‌పురం, కుక్కునూరు మండలాల్లో గల దేవాంగ కులస్తులందరూ వనభోజనాల్లో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## పోడు పట్టాలిచ్చిన ఘనత కేసీఆర్‌దే

రావులపల్లి రాంప్రసాద్



మాట్లాడుతున్న రావులపల్లి రాంప్రసాద్

దుమ్ముగూడెం, నవంబర్ 15 : సుదీర్ఘకాలంగా ఉన్న పోడు సమస్యను పరిష్కరించి, గిరిజనులకు పట్టాలతోపాటు రైతుబంధు ఇచ్చి ఆదుకున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని బీఆర్ఎస్ నాయకుడు రావులపల్లి రాంప్రసాద్ అన్నారు. బుధవారం లక్ష్మీనగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలోనే ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి కొనసాగాలంటే భద్రాచలం ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావును గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 19వ తేదీన భద్రాచలంలో జరిగే మంత్రి కేటీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, కార్యదర్శి కణితి రాముడు, నాయకులు సాగి శ్రీనివాసరాజు, ఎండీ జానీపాషా, తునికి కామేశ్, దిశ కమిటీ సభ్యులు, సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రం తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమల్ కిశోర్

కొత్తగూడెం టౌన్/ రామవరం, నవంబర్ 15 : ఈ నెల 30వ తేదీన జరగనున్న శాసనసభ ఎన్నికల్లో భాగంగా ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకుడు కమల్ కిశోర్ అన్నారు. బుధవారం సుజాతనగర్ మండలం వేపలగడ్డలోని పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్, దివ్యాంగుల కోసం ర్యాంపులు, వీల్‌చైర్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట లైజన్ ఆఫీసర్ మరియన్న పాల్గొన్నారు. చుంచుపల్లి మండలంలోని పెనగడప, రుద్రంపూర్‌లో ఉన్న పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో మందా మంగమ్మ, ఎంపీవో గుంటి సత్యనారాయణ, ఏవో రాజేశ్వరి, స్పెషలాఫీసర్ మరియన్న, పంచాయతీ కార్యదర్శులు చెన్నకేశవులు, హనుమంతు, ఉపేందర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## నాటుసారా పట్టివేత



పట్టుబడిన నాటుసారా, విక్రయదారుడితో పోలీసులు

పర్ణశాల, నవంబర్ 15 : దుమ్ముగూడెం పోలీసులు బుధవారం ఆరు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌సీ టి.కృష్ణయ్య స్టేషన్ సిబ్బందితో కలిసి పెద్దనల్లబల్లి గ్రామం వైపుగా పెట్రోలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి పోలీసులను చూసి పారిపోతున్నాడు. అతడిని వెంబడించి పట్టుకోగా అతని వద్ద ఆరు లీటర్ల సారా లభించింది. దాని విలువ రూ.1800 ఉంటుందని, అతడిని విచారించగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా చంద్రుగూడెం గ్రామానికి చెందిన మిడియం జోగారావుగా పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడితోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కేశవరావు తెలిపారు.

## స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శిరీష

కొత్తగూడెం టౌన్, నవంబర్ 15 : జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ జేవీఎల్ శిరీష అన్నారు. బుధవారం కొత్తగూడెంలో జరిగిన పీసీపీఎన్‌డీటీ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో అబార్షన్ రేటు, ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉన్న ఏరియాల్లో నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. ఆయా ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సమావేశంలో డాక్టర్లు ముక్కంటేశ్వరరావు, చైతన్య, కోరాశ్రీ, అనూష, నరేందర్, డీపీఆర్‌వో శ్రీనివాస్, డిప్యూటీ డెమో ఎండీ ఫయాజ్ మొయుద్దీన్, నాగలక్ష్మి, బేబీ పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



నిందితుడు కృష్ణారెడ్డితో పోలీసులు

కొత్తగూడెం క్రైం, నవంబర్ 15 : ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని త్రీ టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని ఓల్డ్ బస్‌డిపో ఏరియాలో త్రీ టౌన్ ఎస్సై డి. విజయ కుమారి తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని వెంబడించి అదుపులోకి తీసుకొని విచారించగా గార్ల బయ్యారానికి చెందిన మూల కృష్ణారెడ్డిగా తెలిపాడు. ఇతడిపై గతంలో 22 దొంగతనం కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. బైకుని స్వాధీనం చేసుకొని అతడిని కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

## నేడు, రేపు క్రీడాకారుల ఎంపిక

కొత్తగూడెం టౌన్, నవంబర్ 15 : ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్ 14, అండర్ 17 బాలబాలికల సెపక్‌తక్రా, మాల్కంబు ఎంపికలు ఈ నెల 16వ తేదీన రామవరంలోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో, 17వ తేదీన బాలబాలికలకు సైక్లింగ్ ఎంపికలను పాల్వంచలోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల డీఈవోలు తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే ఆసక్తి ఉన్న క్రీడాకారులు 16వ తేదీన ఉదయం 9 గంటలకు హాజరుకావాలని, సైక్లింగ్ క్రీడాకారులు కూడా ఉదయం 9 గంటలకే హాజరుకావాలని పేర్కొన్నారు.